నజర్ బోనం ఊరేగింపునకు రావాలంటూ..

గోల్కొండ కోటలో జూలై 7న ప్రారంభం కానున్న తెలంగాణ ఆషాఢ బోనాల్లో జరిగే నజర్ బోనం కార్యక్రమానికి రావాలంటూ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌కు బోనాల కులవృత్తుల సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి ఆహ్వాన పత్రం అందచేశారు. కార్యక్రమంలో మహంకాళి ఆలయ పూజారి సురేశ్‌చారి, నాయకులు విజయ్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

సమస్యల పరిష్కారం కోసం..

ప్రజా సమస్యలు పరిష్కారంకోసం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాల మేరకు బాగ్‌లింగంపల్లి సూర్యనగర్ బస్తీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఏఈ, బీఆర్ఎస్ నాయకులు నితిన్, శ్రీనివాస్, దామోదర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

ఉన్నా.. ఉపయోగంలో లేని బీసీ బాలుర హాస్టల్

- ఈ విద్యాసంవత్సరం ఒక్కరు కూడా చేరని వైనం
- ఆకస్మిక తనిఖీలో విస్తుపోయిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- అధికారుల తీరుపై అసహనం.. కలెక్టర్‌తో మాట్లాడతానని వెల్లడి

గోల్నాక, జూలై 2 : అంబర్‌పేట నియోజకవర్గంలో వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వసుతుల కల్పన కోసం అటు ప్రభుత్వం.. నిర్వహణపై ఇటు అధికారులు పట్టించుకోక పోవడంతో విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ఫలితంగా ఈ విద్యాసంవత్సరం ఒక్కరూ కూడా హాస్టల్లో అడ్మిషన్ తీసుకోని దుస్థితి స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆకస్మిక తనిఖీలో వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గోల్నాక డివిజన్ వీరన్న గుట్ట లోని ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2016 లో 5వందల గజాల ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనం దుస్థితి చూసి విస్తుపోయారు. తలుపులు లేని మరుగు దొడ్లు, శిథిలావస్థకు చేరిన గదులు, పూర్తిగా అపరిశుభ్రమైన వాతావరణాన్ని చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇక అక్కడ విద్యార్థులు కనిపించక పోవడంతో హాస్టల్ వార్డెన్‌ను ఆరాతీయగా ఈ విద్యాసంవత్సరం ఒక్కరు కూడా జాయిన్ కాలేదని చెప్పడంతో షాక్ తిన్నారు. మరి మీరేమి చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తన దృష్టికి ఎందుకు తేలేదంటూ నిలదీశారు. వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి హాస్టల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు చేరేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు ప్రవీణ్ కుమార్, కిరణ్, రాములు పాల్గొన్నారు.

గోల్నాక వీరన్నగుట్ట ప్రభుత్వ బాలుర హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హాస్టల్లో వంటశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బీసీలకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి

కాచిగూడ, జూలై 2 : కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగ హక్కులను కల్పించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లల్లో రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో జనగణనలో కులగణన చేపట్టి, ప్రధాని తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. బీసీ సమస్యలను పరిష్కరించాలని త్వరలో దేశవ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనవసర డాక్యుమెంట్లు అడుగుతున్నారు..

తహశీల్దార్ కార్యాలయాల్లో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయమై అనవసర డాక్యుమెంట్లు అడిగి అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ హైదరాబాద్ ఆర్డీవోను పిలిచి వివరణ కోరడం జరిగిందని, ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని ఆర్డీవో తెలుపగా కలెక్టర్ సీరియస్‌గా ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు.

- అబిడ్స్

తొలి సీఎం కేసీఆర్‌కు అండగా..

అబిడ్స్ / మెహిదీపట్నం , జూలై 2 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు అండగా నిలిచి తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు పాటు పడ్తామని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎర్రవెల్లిలో వ్యవసాయ క్షేత్రంలో తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సీనియర్ నాయకులు ప్రదీప్ అగర్వాల్, నరేందర్ బిళ్లం, ప్రియాంక గౌడ్‌తో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకలాపాలను కేసీఆర్‌కు వివరించారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు.

ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలిసిన నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్

అభివృద్ధి ఘనత.. తొలి సీఎం కేసీఆర్‌దే

అబిడ్స్, జూలై 2 : బీఆర్ఎస్ ప్రభుత్వం నాంపల్లిలోని అనీసుల్ గుర్బా అనాథ బాలల శరణాలయాన్ని రూ.40 కోట్లు వెచ్చించి భారీగా నిర్మాణం చేశారని బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎం.కె. బద్రుద్దీన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ భవనాన్ని టెమ్రీస్‌కు లీజ్‌కు ఇచ్చి ఆరోపణలు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. నాంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు కానుకలను ఇవ్వడంతో పాటు మసీదుల వద్ద ఇఫ్తార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వాటికి మంగళం పాడారని ఎద్దేవా చేశారు. మైనార్టీలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

పేదవైశ్యుల సంక్షేమానికి ఐవీఎఫ్ కృషి



ఐవీఎఫ్ సలహా మండలి చైర్మన్ రాజమౌళి గుప్తను సన్మానించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త

ముషీరాబాద్, జూలై 2 : పేదవైశ్యుల సంక్షేమం కోసం వైశ్య ఇంటర్నేషనల్ ఫెడరేషన్ కృషి చేస్తుందని ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వైశ్య సంఘం సేవా కార్యక్రమాలతో పాటు పేదలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐవీఎఫ్ అభివృద్ధికి కృషి చేసిన సంస్థ సలహా మండలి చైర్మన్ గంజి రాజమౌళి గుప్తను సన్మానించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రతినిధులు పబ్బ చంద్రశేఖర్, నారాయణ, కటకం శ్రీనివాస్, ముత్యాల సత్తయ్య, కృష్ణమూర్తి, రాజశేఖర్ గుప్త, రమేశ్ రామ్, వి.సుధాకర్ గుప్త, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి, మంజుల, సితార పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.సరోజ

చిక్కడపల్లి, జూలై 2 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి దాని సాధన కోసం పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేయాలని విద్యార్థులకు వక్తలు సూచించారు. బాగ్‌లింగంపల్లిలో అంబేద్కర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మారెడ్డి, కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, జాయింట్ సెక్రటరీ రమణ, ప్రిన్సిపాల్ భారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలి

గంగపుత్రుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి నేతృత్వంలో మంగళవారం మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక కలిసి కోరారు. మత్స్య శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంకకు సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గూడబోయిన శివరత్నం, నాయకులు భగవాన్, మల్లేశ్, అంబటి సుధాకర్, మల్లయ్య పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

కూచిపూడి ప్రదర్శన

కూచిపూడి నాట్యగురువు ఆకుల వినోద్‌కుమార్ శిష్యురాలు ప్రవళిక మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నాట్యప్రదర్శన ఇచ్చారు. పంచమవేద ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ విచ్చేశారు. కార్యక్రమంలో నృత్యకళాకారులు,వారి తల్లిదుండ్రులు పాల్గొన్నారు.

- రవీంద్రభారతి

నేడు కింగ్స్ ప్యాలెస్‌లో మెగా జాబ్ మేళా

అబిడ్స్, జూలై 2 : నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో డెక్కన్ బ్లాస్టర్స్ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా 2024 నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ మన్నన్‌ఖాన్ ఇంజనీర్ పేర్కొన్నారు. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేళాను నిర్వహించనున్నామని తెలిపారు.10వ తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమా, ఇంజనీరింగ్ చేసిన వారు అర్హులని తెలిపారు. 100 కంపెనీలకు చెందిన ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి స్పాట్ ఆఫర్ లెటర్లను అందజేస్తారని మన్నన్‌ఖాన్ ఇంజనీర్ తెలిపారు.

8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

తెలుగు యూనివర్సిటీ, జూలై 2 : రైల్వే కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానం రద్దు చేసి 8వ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు డిమాండ్ చేశారు. మజ్దూర్ యూనియన్ హైదరాబాద్ (నాంపల్లి) జనరల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బ్రాంచ్ కార్యాలయాన్ని మంగళవారం ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైల్వే కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. 8వ పే కమిషన్‌ను ప్రకటించడంలో అలసత్వం వహించరాదని, నూతన పెన్షన్ విధానం వల్ల కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రిస్ట్రాక్షరింగ్ కమిటీని పూర్తి చేసి రైల్వేలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి కార్మికులపై పనిభారం తగ్గించాలని సూచించారు. హైదరాబాద్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. యూనియన్ జోనల్ బ్రాంచ్ కోశాధికారి శ్రీనివాస్, సరోజ నిరెడ్డి, అసిస్టెంట్ జోనల్ సెక్రటరీ ఉదయ భాస్కర్, జితెందర్ భారాటే, శ్రీనివాస్‌రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడు ఖాజా బాబ, సెక్రటరీ రవీందర్, సిసియాస్ ప్రెసిడెంట్ స్వామి, ఏడీఎస్‌లు నాగలక్ష్మి, చైర్మన్ గోపాల్, సెక్రటరీలు వరప్రసాద్, ఢిల్లీరావు, శ్రీనివాస్, సమయ్య, వేద ప్రకాశ్, రాజేందర్, అంజయ్య పాల్గొన్నారు.

నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మజ్దూర్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించిన శంకర్‌రావును సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

గొప్ప సాహిత్య పరిశోధకుడు ఆచార్య ఇనాక్

ముషీరాబాద్, జూలై 2: పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా రెండోరోజు మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఇనాక్ పరిశోధన సాహిత్యంపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇనాక్ అట్టడుగు వర్గాలపై వివక్షతను ఎండగడుతూ రచనలు చేశారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్, జ్యోతిశేఖర్ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్

వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ, జూలై 2 : రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. చంచల్‌గూడకు చెందిన ఎండీ యూసుఫ్ కుమారుడు యూనుస్(32) ప్రైవేట్ ఇంజనీర్. డబీర్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

రైలు ఢీకొని వ్యాపారి..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యాపారి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడలోని ఉస్మాన్‌షాహీకి చెందిన ఇంతాజీమల్లి కుమారుడు అమరారం (54) వ్యాపారి. సోమవారం రాత్రి ఆర్ట్స్‌కాలేజ్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా అజంతా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సమ్మయ్య తెలిపారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీటీఎస్‌పీడీ ఎస్ఎల్ ఫోర్‌మన్ మహ్మద్ మునీర్ పదవీ విరమణ సభ నిర్వహించారు. మునీర్‌ను ఆజామాబాద్ డీఈ కమల్‌కుమార్ సన్మానించారు.

- చిక్కడపల్లి

మెకానికల్ డే సందర్భంగా చిక్కడపల్లిలోని సాయినాథ్ బైక్ మెకానిక్ వారు ఉచిత సర్వీస్ నిర్వహిస్తున్నామని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

అబిడ్స్, జూలై 2 : అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ అన్నారు. వాటర్ వర్క్స్ వివిధ సర్కిల్స్, సెక్షన్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 51 మంది పదవీ విరమణ చేయగా సరూర్‌నగర్ సెక్షన్‌కు చెందిన సి.రాజు, ఉస్మాన్‌సాగర్ సెక్షన్‌కు చెందిన రమేశ్‌కు లక్ష్మీనారాయణ వీడ్కోలు పలికారు. 45 మందికి పదవీ విరమణ చేసిన వారి గ్రాట్యుటీ చెక్కులను చెల్లించేందుకు వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్ పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు రాయసం పురస్కారాలు

కిన్నెర ఆర్ట్ థియేటర్స్, రాయసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తాజ్‌మహాల్ హోటల్‌లో మంగళవారం సాయంత్రం రాయసం సుబ్బారాయుడు పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త రేమిల్ల వెంకటరామ కృష్ణశాస్త్రికి, రాయసం మహాలక్ష్మి పురస్కారాం ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జాకిల బాలకి విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి, సాహితీవేత్తలు ఓలేటి పార్వతీశం, ఎన్.వి. అనంతకృష్ణ, డాక్టర్ ఏ.విద్యాదేవి పాల్గొని ప్రదానం చేసి సన్మానించారు.

- తెలుగు యూనివర్సిటీ

IN THE COURT OF THE HON'BLE 22nd JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD

O.S.No.2594 of 2024

Between
1.Preethi Thakur W/o. Late Sukhbeer Singh
2.Thakur Pranav Singh, S/o. Late Sukhbeer Singh,
3.Thakur Eshan Veer Singh, S/o. Late Sukhbeer Singh,
All are residents of H.No. 9-1-184/A/5/1, Ramdaspura, Langerhouse, Hyderabad
.....PETITIONERS

AND

1. The Tahsildar,Golconda Mandal, Hyderabad
2. All Concerned ....RESPONDENTS

NOTICE

Please take notice that the above Suit has been filed grant of Legal Heir Status in favour of the petitioners in the matter of Late Sukhbeer Singh, and the said case is posted to 18-07-2024 at 10.30 AM for anybody's claims/objections.

// By the Order of the Hon'ble Court//
Sd/- B.Anasuya, T. Sasi Kumar
Advocates
9-1-224/A/41, Prasanth Nagar,
Langar House, Hyderabad-500008
Ph: 6304330749/9966234316

గ్రామ రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమైనది

చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సతీశ్

సుల్తాన్‌బజార్, జూలై 2 : రెవెన్యూ పరిపాలన వ్యవస్థలో గ్రామ రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమైనదని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల జాక్ చైర్మన్ గోల్కొండ సతీశ్ అన్నారు. మంగళవారం ఆయన జాక్ సభ్యులతో కలిసి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీఆర్వోలకు నష్టం జరిగిందని, ఇతర శాఖల్లో ఉన్న వారిని రెవెన్యూ శాఖలోకి తీసుకోవడంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని విన్నవించారు. వీఆర్వోలు 49 అధికార విధులు నిర్వహిస్తారన్నారు. వారి విషయంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ వీఆర్వోలకు జరిగిన అన్యాయంపై పూర్తి అవగాహన ఉందని ఈ సందర్భంగా అన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రితో మాట్లాడి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.